# వీరి వీరి గుమ్మడి వీరి బాధేంటి?

అదొక చిన్న వీధి. వీధి అనడంకంటే ఉద్యోగస్తుల కాలనీ అంటే చక్కగా సరిపోతుంది.. చాలా ఏళ్లుగా ఆ కాలనీ వాసులంతా ఒక కుటుంబంలా కలిసిపోయి ఏ చీకుచింతా లేకుండా సహజీవనం కొనసాగిస్తున్నారు. అలాంటిదీమధ్య లేటెస్ట్‌గా ఆకాలనీలో హఠాత్తుగా ఓ సమస్య తలెత్తి... మగ మహారాజుల్ని తలలు వంచుకునేలా చేసింది. అటు ఆఫీసుల్లోనూ.. ఇటు ఇళ్లల్లోను... వాళ్లందరికీ నిద్రల్లేకుండా చేసేస్తోంది.

ఏ ఇద్దరు మగాళ్లు కలిసినా అదే చర్చ. ఈ కాలనీ ఉద్యోగస్తులు ఏ చోటచేరినా అదే గుసగుస. అందరికీ ఇదో తలనొప్పి వ్యవహారమైపోయి ప్రతి కుటుంబంలోనూ కలతలు రేపి, కన్నీళ్లు మోపి, ఆ కాలనీ అంతటినీ అతలాకుతలం చేసేస్తోంది.

ఇంతకీ అసలు విషయమేమంటే...

ఆ కాలనీలో కాస్త విభిన్నంగాను, మిగతా వాటికంటే మరింత సౌలభ్యంగానూ ఉన్న కొన్ని స్పెషల్ పోర్షన్స్ ఉన్నాయి. అవి కేవలం ఆఫీసర్స్ కేటగిరి వాళ్లకి కేటాయించబడినవే అయినా కొన్నింటిలో తక్కువ క్యాడర్‌వాళ్లు కూడా ఉంటున్నారు. వాటిలో ఇదొకటి, ఇందులో ప్రస్తుతానికి ఈ మధ్యనే బదిలీ అయివచ్చిన అసిస్టెంట్ మేనేజర్ గోపాలం ఉంటున్నాడు .

"ఏం చేస్తున్నారు...?" దీర్ఘాన్ని మరింత దీర్ఘం చేస్తూ, వడివడిగా పరుగెత్తుకు వచ్చాడు. ఎదురు పోర్షన్‌లో ఉంటున్న హెడ్ గుమాస్తా గుర్నాథం... తెగ ఆయాస పడుతూ..

"ఇడ్లీపిండి గ్రైండ్ చేస్తున్నాను. కాస్త నెమ్మది. నెమ్మదిగా మాట్లాడండి. మా ఆవిడకి నిద్రాభంగమవుతుందేమో?" వచ్చిన ఆసామిని కూచోమని చేత్తో చూపించి కళ్లతో సైగ చేస్తూ లోగొంతుకతో అభ్యర్థించాడు గోపాలం.

"అంటే.. అంటే.. మీ ఆవిడ్ని కూచోబెట్టి మరీ ఆడంగి పనులు చేసేస్తున్నారా? హవ్వ? హవ్వ? సిగ్గు లేదూ ఆ మాట చెప్పుకోవడానికి?" నోరెళ్లబెడుతూ ప్రశ్నించాడు.

"ఇందులో అంతగా సిగ్గుపడాల్సిన మ్యాటరేముందని?" ఎదురు ప్రశ్నించాడు.

"అది సరే, మీ గ్రైండింగ్ పనులకి మీ ఆవిడ నిద్ర లేవదు. నా మాటలకి మాత్రం ఆవిడగారికి మెలకువొస్తుందా?" ఉక్రోషంగా పెదాలు బిగించి వ్యంగ్యంగా అడిగాడు.

"మీదేమో కొత్త గొంతు. పైగా కాస్త గరుకు. ఆ ధ్వనికి ఉలిక్కిపడుతుందేమోనని! గ్రైండర్ శబ్దాలు అలవాటైనవే కదా! ఇంతకీ తమరు మా ఇంటికి వేంచేసిన పనేమిటో సెలవిస్తారా?" సౌమ్యంగా అడిగాడు.

"మీ గురించి కాలనీవాళ్లంతా ఏవిటేవిటో చాటుగా చెప్పేసుకుంటుంటే స్వయంగా విన్నాను. నిజమో, కాదో తేల్చుకుందామని నేనే రంగంలోకి వచ్చాను!" కళ్లెత్తి మరీ చెప్పాడు.

"ఏం విన్నారో..?" కుతూహలంగా అడిగాడు.

"ఏం వింటే ఏం? భార్యని కాలుకింద పెట్టనివ్వకుండా పనంతా చేసేస్తున్నారని తెలుస్తూనే ఉందిగా!" వెటకారంగా అన్నాడు.

చేతిలోని కళ్లద్దాల్ని కళ్లకి తగిలించుకుని, అర్ధాంతరంగా సంభాషణ ముగించి వచ్చినంత వేగంగా రుసరుసలాడుతూ వెళ్లిపోయాడు గుర్నాథం.

బదులుగా చిరుమందహాసం చేశాడు గోపాలం.

* * *

"గోపాలం గారూ! గోపాలం గారూ!" వచ్చీ రావడంతోనే లోపలికి తొంగి తొంగి చూస్తూ కేకేసి పిలిచాడు బ్రహ్మానందం.

కాలుకాలిన పిల్లిలా ముందు గదిలో కాసేపు అటూ ఇటూ తచ్చాడాడు.

ఇంతలో "ఎవరదీ... వచ్చేస్తున్నా!" అన్న గొంతుతో పాటే గోపాలం సీన్‌లోకి ఎంటరయ్యాడు.ఆయన బయటకు రావడంతోనే "నమస్కారమండీ!" చేతులు రెండూ జోడించి మరీ తన వినయ విధేయతల్ని చాటుకున్నాడు.

కంప్యూటర్ సెక్షన్‌లో ఆపరేటర్ అయిన బ్రహ్మానందం తూర్పు వైపు పోర్షన్‌లో ఉంటున్నాడు.

"నమస్కారం! కూచోండి!" అంటూ అతను కూచోగానే తనూ కూచున్నాడు గోపాలం.

"ముందు గదిలో ముచ్చటగా ఏ పేపరో, వీక్లీనో చదువుతూ సోఫాలో దర్జాగా కూర్చునే సీట్లో మీరుండి ఉంటారనుకున్నాను. అదేమిటి అలా వంటింట్లోంచి వస్తున్నారు?" సందేహంగా అడిగాడు.

"వంటకి కూరగాయలు తరుగుతున్నవాడిని వంటింట్లోనుండి రాకుండా బాత్రూమ్ నుండొస్తానా? మీరు భలే జోక్ చేస్తారే?" కామెంట్ చేశాడు.

"జోకా...? నా మొహానికి జోకొకటా! బావుంది. ఇది మరీ బావుంది! పైగా వంట చేస్తున్నాని చెబుతున్నారా?" విస్తుపోతూ అడిగాడు.

" ఏం, చెప్పకూడదా? సీక్రెటేం కాదుగా!" అనుమానంగా అడిగాడు.

"చెప్పొచ్చు, ఎందుకు చెప్పకూడదూ! వీలైతే మైకొకటి పుచ్చుకుని కాలనీ అంతా తిరగొచ్చు. అవునూ ... మీ ఆవిడగారు కానీ పుట్టింటికెళ్లారా ఏంటి?" తన డౌటు ముందుంచాడు.

"మా ఆవిడను వదిలి ఒక్క క్షణం ఉండను నేను. అలాంటిది ఆమె నన్నొదిలి పుట్టింటి కెళ్లడమేంటి? మీరు మరీనూ?" అన్నాడు సిగ్గులొలకబోస్తూ.

"మీ ఆవిడ ఇంట్లో ఉండగానే మీరిలా వంట చేయడం... మీకు బాగుందేమో కానీ మాకు అసలు బాగోలేద్సార్! పైగా నేను విన్నది వాస్తవమేనన్న ఘోర నిజం తెలిశాక... ఉల్లి తరక్కుండానే కన్నీళ్లొస్తున్నాయండీ!" ప్రాక్టికల్‌గా రెండు చుక్కలు కార్చాడు ఎమోషనల్‌గా.

"గ్లిసరిన్ లేకుండానే కన్నీళ్లు... బాగుంది, అవునూ నేను వంట చేస్తే మధ్యలో నీకేంటయ్యా బాధ?" ఆశ్చర్యపోయాడు గోపాలం అర్థం కానట్లు మొహం పెట్టి.

"మరదే...! నాకందుకే ఏడ్పొచ్చేది. మీరు మీ ఆవిడకి వండి వడ్డిస్తున్నారని ఇంట్లో మా ఆడాళ్లు ఒకటే గోల. నన్నూ వంట చేసి పెట్టమని ఒకటే నస వేగలేక ఛస్తున్నానండీ!" భోరుమన్నాడు చిన్నపిల్లాడిలా.

"ఓ... అదావిషయం" అంటూ నర్మగర్భంగా నవ్వాడు.

"ఏవిటండీ. అదా... అంటున్నారు. నా కేడుపొస్తే మీకు నవ్వులాటగా ఉందా?" అంటూ ఎడంచేత్తో కన్నీళ్లు తుడుచుకుని. సీన్‌ని కట్‌చేసుకుంటూ వచ్చినంత హడవుడిగా వెళ్లిపోయాడక్కడినుండి.

గుంభనంగా నవ్వుకున్నాడు గోపాలం.

❋ ❋ ❋

"హలో.. సారన్నా!" విష్ చేసుకుంటూ వచ్చాడు పడమర పోర్షన్‌లో ఉండే టైపిస్ట్ మోహన్.

అతగాడి చేతి వేళ్లమధ్యనున్న సిగరెట్ తలకొరివి పెట్టినట్టు కాలిపోతోంది. అతడి నోట్లోంచి పొగ రింగులురింగులుగా విన్యాసమై బయటపడుతోంది.

"హలో ...రండ్రండి!" ఆహ్వానించాడు గోపాలం.

"మీ యావిడకి హార్లిక్సో...కాఫీనో కలుపుతున్నట్లున్నారు కదన్నా?" అడిగాడు మోహన్.

"కరెక్టుగా చెప్పారు. హార్లిక్స్ కలుపుతున్నాను. ఎలా చెప్పగలిగారు? గెస్సా?" ప్రశ్నించాడు.

"ఊహించేం కాదు. మీ ఇంట్లో జరిగే తంతు గురించి ఇంటర్మీడియట్ క్వొశ్చన్

పేపరులా ఆల్రెడీ లీకయ్యింది కనుక! అయినా మీరు చేసే పనీ అదేగా అన్నా! భార్యని కూర్చోబెట్టి వంటపనీ, ఇంటిపనీ చేసేయడం! వీధిలోని మిగతా ఇళ్ల కాపురాల్లో చిచ్చుపెట్టడం!!" ముక్కులోంచి వచ్చిన పొగని నోటితో వూదేస్తూ చిరాగ్గా చెప్పాడు.

"మీ ఇళ్లల్లో చిచ్చు పెట్టడమేమిటి? ఇది మరీ బావుంది. అయినా నా భార్య, నా సంసారం-నా ఇష్టం! మీరెవర్సార్ అడగడానికి?" కాస్త కోపంగా ముఖాన్ని ఎక్స్‌ప్రెస్ చేశాడు.

"మీ ఇష్టమే మా పాలిట కష్టమైపోతోందన్నా! మీ కెలా చెప్పను నా గోడు? నాకీమధ్యనే పెళ్లయింది. కొత్త పెళ్లాంతో సరదాగా సరసంగా ఉండలేకపోతున్నాను..." పొగ వదుల్తూ చెప్పాడు విచారంగా మొహం పెట్టి.

"అందుకు నేనేం చేయను? వెళ్లి డాక్టర్ సమరంగారినోసారి కలవండి! ప్రాబ్లెమ్ ఈజీగా సాల్వవుతుంది!" మధ్యలో అడ్డుకున్నాడు.

"వద్దు. జోకులొద్దన్నా! నే చెప్పొచ్చేదేమంటే... మీరు మీ ఆవిడకి వంటచేసి పెడుతున్నారని తెలిసి కొత్త పెళ్లాన్ని కదా నాకు మీరు చేసి పెట్టడంలో తప్పేమిటి? నా మీద ప్రేమ లేదన్నట్లేగా? అంటూ నా భార్య ఒకటే పోరు పెడ్తోంది సార్! మేం సంసారం చేసుకోవాలా, వద్దా చెప్పండన్నా!" వాపోయాడు మోహన్.

"చేసుకోండి. ఎవరొద్దన్నారు? మీ ఆవిడ చెప్పినట్టే వంట చేసేస్తూ... హాయిగా కాపురం చేసుకో తమ్ముడూ!"

"చేయొచ్చు. కొత్త పెళ్లాం కదా! కానీ ఇలా కొత్తలో చేసిపెడితే ఇక జీవితాంతం మీ బ్రాండ్‌లా తయారవుతానేమోనని బెంగ పట్టుకుందన్నా!" గొంతులో కించిత్ బాధ కదలాడింది.

చేతి వేళ్లని సిగరెట్ కసిగా చురుక్కుమనిపించడంతో దాన్ని కింద పడేసి కాలేసి బలంగా నొక్కి వదిలేశాడు.

"విషయం అర్థమైంది. అయినా మీ భార్యకి మీరు నచ్చచెప్పుకోవాలి. నేనేం చేస్తా దానికి?" కామ్‌గా అన్నాడు.

"అలా అనొద్దన్నా! నా కన్యాయం చెయ్యొద్దన్నా! నన్నొదిలేసి మా మిసెస్ పుట్టింటికెళ్లడానికి ట్రై చేస్తోందన్నా!" చెప్పి. జాలిగా మొహం పెడుతూ వెళ్లడానికి సంసిద్ధుడయ్యాడతను.

"దానికింత కంగారెందుకోయ్ తమ్ముడూ! నువ్వే ముందుగా మీ ఆవిడ్నొదిలేసి మీ అత్తారింటికెళ్లిపోరాదూ?" సలహా వదిలాడు.

గుర్రుగా అతడివేపోసారి చూసి. "ఛ...! జోకులాపన్నా! నే చెప్పేది వినండి, మీరింట్లో వంట చేయడమన్నా మానాలి. కుదరని పక్షంలో మీ ఆవిడచేతే వంట చేయిస్తున్నారని కనీసం ప్రచారమైనా చేయండి!" అనేసి, జాలిగా చూపొకటి విసిరి మౌనంగా తలొంచుకుని వెళ్లిపోబోతున్న మోహన్ వెన్ను చరిచాడు గోపాలం చిరునవ్వు చిలికిస్తూ.

* * *

"నమస్తే... పెద్ద సారుకి!" శాల్యూట్ టైప్‌లో యాక్షన్ చేస్తూ వచ్చాడు సుధాకర్.

"నమస్తే... నమస్తే...! మీరు..." సందిగ్ధంగా చూస్తూ అడిగాడు గోపాలం.

"సుధాకర్‌ని. ఈ కాలనీలోనే ఉంటాను. రికార్డు అసిస్టెంట్‌ని. ఇవి చేతులు కావు, కాసేపు కాళ్లనుకోండి! నా కడుపుమీద మాత్రం కొట్టకండి సార్!" గోపాలం చేతులు పట్టుకుని బతిమిలాడాడు.

"ఛ! వూర్కో...! మనమేదైనా బాక్సింగ్ పోటీలో పాల్గొంటున్నామా, నీ కడుపుమీద నే కొట్టడానికి?" సముదాయించాడు.

"కడుపుమీద కొట్టడమంటే నిజంగానే ఫైటింగ్‌లో కాద్సార్! హయ్యో ... నేనేం చేసేది? మీకెలా చెప్పేది? నాకు మీరు పోటీగా తయారైతే నేనెటు పోయేది? నా భార్యా పిల్లలేం గాను?" తల పైకెత్తి రెండు చేతులూ అన్చుకుని కళ్లు మూసుకుని ఫీలింగిచ్చాడు.

"నేను మీకు పోటీ ఏమిటి? ఇదంతా ఏవిటీ? కాస్త అర్థమయ్యేటట్లు చెప్పండీ!" చిరాగ్గా అన్నాడు.

"మీరు వంట చేస్తార్టగా?" రహస్యమైనట్లు చెవిలో గుసగుసలాడాడు.

"అవును. చేస్తాను. చేస్తే ఏం?" నిర్లక్ష్యంగా అడిగాడు.

"ఆఁ... ఏం లేదూ, చికెన్ బిర్యానీ వడ్డించుకు తిందామని!" కసిగా అన్నాడు.
"మీ ఆవిడింట్లో లేదా? నాతో చేయించుకు తినడమేమిటి?"

"ఉంది. లేకేం? ఉన్నా, మీలా నేనెప్పుడూ ఇంట్లో వంట చేసెరగను. బయటవాళ్లకి మాత్రమే ఫంక్షన్స్‌లో చేస్తూంటాను. ఆ కుకింగ్ బుకింగ్స్ అన్నీ మీకొచ్చేస్తే నా సైడ్ ఇన్‌కమ్ ఏం గానూ? హయ్యో...!" మళ్లీ వాపోయాడు.

"ఛ! ఊర్కోవయ్యా! నేనేం నీ సైడ్ బిజినెస్‌లో వేలెట్టను. కాలెట్టను. కానీ బాధపడకు!" హామీ ఇచ్చాడు.

"నిఝమా సార్?" మెరుస్తున్న కళ్లతో అడిగాడు.

"నిజంగా ... నిజమే! సంతోషంగా వెళ్లిరా!" నచ్చచెప్పాడు నమ్మకంగా.

"థాంక్యూ సార్! అంటూ కృతజ్ఞతాపూర్వకమైన లుక్కొకటి విసిరి ఊపిరి పీల్చుకుంటూ వెళ్లిపోయాడు.

హాయిగా నవ్వుకున్నాడు గోపాలం.

* * *

"గోపాలం గారంటే మీరే కదూ!" ఓసారి గోపాలాన్ని పైనుండి కిందిదాకా ఎగాదిగా చూసి ఎదురుగా కూచుంటూ అడిగాడు.

"ఆఁ ...నేనే! సాక్షాత్ గోపాలాన్ని! చాలా చక్కగా పోల్చుకున్నారే?" మెచ్చుకోలుగా అన్నాడు.

"కాలనీ వాళ్ల నోళ్ల చుట్టూ తిరుగుతున్న స్పెషల్ క్యారెక్టర్ కదా తమరిది! గుర్తుపట్టకఛస్తానా!" ముక్కుపుటాలుబ్బిస్తూ చెప్పాడు.

"ఇంతకీ మీ పరిచయం ...?" అంటూ సంశయంగా ఆగిపోయాడు.

"నా పేరు భరణి అంటారండీ! మీ వెనక పోర్షన్‌లో కాపురముంటున్నాను. నాది అకౌంట్ సెక్షన్‌లెండి!" పళ్లికిలిస్తూ తన పరిచయం చేసుకున్నాడు భరణి.

ఇంతలో ఏదో గుర్తొచ్చినవాడిలా షర్టు జేబులోంచి మాణిక్‌చంద్ పొట్లం తీసి, ఎత్తు పళ్లతో కసుక్కున కవరు చించి తలెత్తి మొత్తం పొడిని నోట్లోకి ఒంపుకున్నాడు. నాలికతో దవడకి చేర్చుకున్నాడు.

ఏమీ మాట్లాడలేదు గోపాలం. పెదవి విప్పకుండా అతగాడి చర్యల్నే తీరుబడిగా గమనిస్తున్నాడు.

"నేనీ వయసులో స్వయంగా వంట నేర్చుకోవడమంటే యమ కష్టం కదండీ?" అడిగాడు భరణి కళ్లు మూసి తెరుస్తూ... ఉన్నత భావాల మాణిక్‌చంద్ రసాస్వాదన కొనసాగిస్తూ.

"ముందునుండీ అంతగా అలవాటు గనక లేకపోతే మీరన్నట్టు కష్టమేనండీ!" ఒప్పుకున్నాడు గోపాలం.

"కనీసం నేర్చుకోలేకపోయినా వంటల పుస్తకాలు చూసి చేయడమూ ఇబ్బందే కదండీ!" రెట్టించి అడిగాడు.

"అవునండీ!" వంత పాడాడు.

లేచి వెళ్లి డోర్ బయట ఉమ్మి వచ్చి మళ్లీ "అందుకే మీ దగ్గర వంట చేయడం నేర్చుకోవాలనుకుంటున్నానండీ! ఫీజెంతైనా ఫరవాలేదు. మీకేమైనా అభ్యంతరమా?" తిరిగి కళ్లు మూసి అడిగాడు.

"వంటలు చేయడం నేను నేర్పుతానని మీకెవరు చెప్పారు?" కనుబొమ్మల్ని ముడుస్తూ ప్రశ్నించాడు.

"నేర్పుతారని ఎవరూ చెప్పలేదు కానీ, ఈ కాలనీ అంతటిలో వంట చేసే మగవారు మీరొక్కరేనని చెప్పుకుంటున్నారు కాలనీవాళ్లంతా. మీరు చేయగా లేంది. నేను చేస్తే తప్పేమిటని ఇంట్లో నా వైఫ్ క్వశ్చనింగ్ చేస్తోంది!" అసలు విషయం చెప్పాడు.

"చేస్తానని మీరు ఆన్సరింగ్ ఇవ్వలేకపోయారా?"

"ఎలా ఇస్తాను? మగాళ్లు వంట చేయడం మా ఇంటా వంటా లేదుమరి!"

"అది మీ ఇంటి విషయం. నాతో చర్చించడం సింబాలిక్‌గా అంత బావుండదేమో?" మొహం అదోలా పెడుతూ అన్నాడు గోపాలం.

"ఇంటి విషయమా, పాడా! కాలనీ.. కాలనీ విషయమండీ బాబూ!" ఉడుక్కున్నాడు.

"ఏ విషయమైనా అది మాత్రం నాకు సంబంధం లేని విషయం!" నిక్కచ్చిగా చెప్పాడు గోపాలం.

"కుదరకపోతే ఇంట్లో వంట చేయడమైనా మానేయండి! మీ ఆవిడచేతనైనా చేయించుకోండి! వంటమనిషినైనా పెట్టుకోండి. మా ఇళ్లల్లో మాత్రం మా పరువు కాపాడండి సార్!" రాజీ ధోరణిలో చెప్పేసి, గోపాలం ఏదో చెప్పబోతున్నా వినిపించుకోకుండా నింపాదిగా నడుచుకుంటూ వెళ్లిపోయాడు భరణి.

ఎప్పట్లా ఈసారెలాంటి నవ్వు విసరకుండా... అతడు వెళ్లినవైపే దృష్టిసారిస్తూ... దీర్ఘంగా ఓ నిట్టూర్పు విడిచి భుజాలెగరేశాడు గోపాలం.

* * *

ఆ రోజు ఆదివారం ...

తనని కలిసి తమ అభిప్రాయాల్ని, అనుమానాల్ని నిస్సంకోచంగా తనతో పంచుకున్న ఆ అయిదుగురు వ్యక్తుల్ని హోటల్ మెలొడీలో టీపార్టీకి పిలిచాడు. గోపాలం.

"టీ పార్టీకి పిలిచి మమ్మల్నేదో మభ్యపెట్టి... మగవారై ఉండి ఎప్పట్లా ఇంట్లో మీరే వంట చేస్తానంటే ఒప్పుకునేది లేదు. ఈ కాలనీ పరువు పోనిచ్చేది లేదు. వింటున్నారు కదూ?" కళ్లద్దాల్ని సవరిస్తూ దీర్ఘాన్ని యథావిధిగా కొనసాగిస్తూ పార్టీ ప్రసంగానికి నాందీ ప్రవచనం పలికాడు గుర్నాథం గోపాలం కేసి చూస్తూ.

బదులుగా ఎప్పట్లా నర్మగర్భంగా నవ్వాడు గోపాలం. మిగతావాళ్లంతా అయోమయంగా చూస్తూండిపోయారు.

కొద్ది ఘడియల నిశ్శబ్దానంతరం ...

"నాకు తెలుసు, ఇంతింత ఉద్యోగాలు చేస్తూ ఆడవారిని కూచోబెట్టి వంట చేయడమనే సమస్య తలెత్తి .. మీలో ఉన్న మేల్ ఈగో దెబ్బతింటున్నదని, అందుకే నా మీద దాడిచేశారని ...!" ప్రారంభించాడు గోపాలం.

"ఉండదా, అన్నా! కరెక్ట్‌గా చెప్పారు!" బుంగమూతి పెడుతూ అన్నాడు మోహన్.

"నిజానికి మనమంతా హైలీ ఎడ్యుకేటెడ్ పర్సన్స్‌మి! ఆడవాళ్లు మగవారితో సమానంగా పరోగమిస్తూ, కొన్ని సందర్భాల్లో మనకంటే ముందంజ వేస్తున్న నేటి కాలంలో చదువుకున్నవాళ్లం, సంస్కారం తెలిసినవాళ్లం .. మనమే ఇలా ఆలోచించడం రియల్లీ పిటీ!

"ఇంట్లో మగవాడు వంట చేయడమే తక్కువనే భావనే మనలో మెదిలితే మనం నాగరికులమెలా అనిపించుకోగలం? బాధ్యతల్ని పంచుకుని, భార్యాభర్తలు సమానమనే భావన మలుచుకుని, సహజీవనం కొనసాగించడమే సంసారం! తరతరాల సామాజిక శాస్త్రాల్ని తిరగేయండి. పోనీ మరే శాస్త్రంలోనైనా రాసి ఉందా అలా? ... ఆడవారే విధిగా వంట చేయాలి, మగవారు కూడదని!" కించిత్ ఆవేశం ధ్వనించింది గోపాలం కంఠంలో.

"ప్రతిదినాం మాణిక్‌చంద్ నమిలేటోడ్ని ... నాలో ఉన్నత భావాలు నూరిపోయడానికి ట్రై చేయకుండా సూటిగా చెప్పండి!" దవడనాడిస్తూ చెప్పాడు భరణి.

"మా మొహాలకి లైసెన్స్ ఎందుకండీ బాబూ? ముందు అసలు విషయం తేల్చండి!" తన పార్ట్ డైలాగ్స్ సీన్‌లో అందించాడు బ్రహ్మానందం.

"ఆ( ... పాయింటుకే వస్తున్నా, ఆగండి! నాకు మీరో ప్రామిస్ చేయాల్సి ఉంటుంది!" అన్నాడు గోపాలం.

"హయ్యో ...! మధ్యలో ఈ ఫిటింగేంటండీ పెద్దసారూ" తల పట్టుకున్నాడు సుధాకర్.

"నేను చెప్పబోయే విషయం మీ ఆడాళ్లకి చెప్పబోమని ముందు నాకు మాటివ్వండి!" చేతులు జోడించి అడుగుతున్నాడు గోపాలం.

అతగాడి చర్యకీ, అభ్యర్థనకీ విస్మయం చెందుతూ ఒకరి మొహాలొకరు చూసుకుని 'సరే' నంటూ తలలూపారొక్కసారిగా.

"నాకిద్దరు పిల్లలు. మా పెద్దమ్మాయి వరంగల్‌లో మెడికో చేస్తోంది. చిన్నబ్బాయి గుంటూరులో ఇంజనీరింగ్ చదువుతున్నాడు. నా పిల్లలిలా ఎదగడానికి... నేనన్ని విధాలా ఉన్నత శిఖరాలు చేరుకోవడానికీ... నా భార్యే కారణం. ఏవీ లేనివాడిగా ఉన్న వేళ నాకు ఇల్లాలై, తోడై, కష్టాల్లో నన్ను వెన్నంటి ఇవన్నీ సాధించేలా చేసిన నా అర్ధాంగి... తాను సుఖపడే సమయానికి నాకు దూరమవబోతుంది.

మా ఆవిడ మరెన్నో రోజులు బతుకదని డాక్టర్లు నిర్దయగా చెప్పారు. ఈ విషయం ఇతరులకి తెలిస్తే వారు చూపే జాలి, దయ, సానుభూతులకి ఆమె గుండె తట్టుకోలేదు. ఇంతకుముందు పనిచేసిన ఊళ్లో ఇదే జరిగింది. అందుకే కావాలని ట్రాన్స్‌ఫర్ చేయించుకుని, ఆ వాతావరణానికి దూరంగా ... వచ్చాను.

కావాలనే ఇన్నాళ్లూ ఈ విషయం ఇక్కడ దాచిపెట్టాను.

ఏ పని మనిషిని పెట్టినా, మన మనిషై ఆమెను కంటికి రెప్పలా చూసుకోదు. అన్నీ ఉండీ అనుభవించలేని దురదృష్టవంతురాలు నా భార్య. అందుకే నా ప్రాణానికి ప్రాణంగా చూసుకుంటు స్వయంగా ఈ భాగ్యం పొందుతున్నాను. నా సహజీవన సహధర్మచారిణి కళ్లల్లో కదలాడే తృప్తిని చూసుకుని మురిసిపోతున్నాను.

నవ్వినా, ఏడ్చినా కన్నీళ్లే వస్తాయన్నాడో మహాకవి. నా ఆనందభాష్పాల వెనుక దాగిన అనంత దుఃఖసాగరం మీకు తెలియకూడదనే ప్రయత్నం చేశానిన్ని రోజులు. కుదరలేదు. ఇదే నా కథ. మీకు తెలియని మనోవ్యథ!" చెబుతుంటే మార్దవమైన ఆయన కంఠం... చెప్పడం పూర్తయ్యాక దుఃఖాన్ని ఆపుకోలేకపోయింది. భోరుమని చిన్నపిల్లాడిలా ఏడ్చేశాడు.

అక్కడున్న వారందరి వదనాల్లో విచారం చోటుచేసుకుంది.

వేదనాభరితమైన గోపాలం అంతరంగం అర్థమై ... ఆయన్ని ఓదార్చే ప్రయత్నంలో మునిగిపోయారు కాలనీ వాళ్లంతా.

❖